


శ్రీదేవీ మురళీధర్

# పెద్దమ్మ గొడుగు

మా ఊరి కామందుగారి భార్య పెద్దమ్మ. ఆవిడ అసలు పేరు ఎవరికీ తెలీదు. అంతా ఆవిడను 'పెద్దమ్మా' అనే పిలుస్తారు. కామందుగారు సరేసరి, ఆవిడతో మాటాడేదే అరుదు, ఇక పిలవటం కూడానా?

అరవై ఏళ్లు వచ్చినా పాతికేళ్ల పడుచులా చలాకీగా తిరుగుతూంటుంది. వయసుని లెక్క చెయ్యకుండానన్న మాట. వయసునే కాదు ఆమె మనుషుల్నే లెఖ్ఖ చెయ్యదని అంతా అనుకుంటూంటారు.

ఆ చుట్టుపక్కల ఎవ్వరికీ లేనన్ని చీరలూ, నగలూ ఆవిడకున్నాయి. సంపన్నుల ఇంట్లో పుట్టి, సంపన్నుల ఇంట్లో మెట్టింది. కట్టిన చీర నెలదాకా కట్టదని పేరు. ఏడు వారాల నగలూ ఉన్నాయి. బరువని బద్ధకించకుండా సాధ్యమైనన్ని పెట్టుకుని 'అచ్చం మహాలక్ష్మిలా ఉన్నాను కదండీ!' అని తరచూ కామందుగార్ని నిలేసి మరీ అడుగుతూంటుంది. ఆవిడ ఏదడిగినా 'అవును', 'కాదు'ల మధ్యస్థంగా తల ఊపటం అలవాటు చేసుకున్నాడాయన.

చేతికింద ఏ పాలేరునీ బతకనివ్వదని కాకుల్లాంటి లోకులు చెప్పుకుంటారు. 'చేతకాని వెధవలు, అంత కంటే ఏం చెబుతార్లే' అని తీసిపారేస్తుందావిడ.

'పిల్లికి బిచ్చం పెట్టదు. సంకురాత్రి పూట హరిదాసు వస్తే చేటతో చారెడు బియ్యం పొయ్యటానికి చేతులురావు'.

'సోది రామక్క పండగ నాడు వస్తే కనీసం నాలుగు పుచ్చువంకాయలైనా దాని జోలెలో వెయ్యకుండా కూకలు వేసి మరీ వెళ్లగొడుతుంది'.

"అమ్మతల్లిలాగా ఒంటెడు బంగారం దిగేసుకుంటే సరా?" అంటారు కొందరు సామాజిక స్పృహ కలిగిన వాళ్లు లోగొంతుకతో.

"ఏడిశారు, నా నగలు చూసి అక్కసు పట్టలేక ఏడిస్తే బావుండదని ఇలా వెళ్లబోసుకుంటుంటారు చచ్చు పీనుగలు" గణగణ నవ్వి నలుగురికీ వినబడేంత గట్టిగా అంటుందామె.

మంచో కామంచో పెద్దమ్మకు ఒక అలవాటుంది. తనేదైనా కొంటే నలుగురూ చూచి మెచ్చాలని! మనలో చాలామందికి ఉండే కోరికే అది.

ఆకుపచ్చ, పసుపు గళ్ల పట్టు రవిక చెన్నపట్నం నుంచి తెప్పించుకుని మరీ కుట్టించుకుంది. అలా కొత్త వస్తువు ఏదైనా ఏర్పడినప్పుడల్లా ఆవిడ మనసు పౌర్ణమి నాటి సముద్రంలాగా పోటెత్తుతుంది. ఆ కొత్త రవిక తొడుక్కుని ముస్తాబై, పూలసంచీ వెండిది చేత బుచ్చుకుని గుడికంటూ బయల్దేరుతుంది. దోవపోడుగూతా పేరుపేరునా అందరినీ ఆపి పలకరిస్తుంది.

"ఇదుగోనమ్మావ్! ఈ పట్టు రవిక రెండొందల రూపాయలుట. మా వాళ్లు చెన్నపట్నం నుంచల్లా పంపారు. మీకు తెలుసా? అంజలీదేవి కొనే దుకాణం నుంచే కొన్నారట' అంటూ కొసమెరుపు అంటించేది.

"ఆ, అలాగా? అయితే ఆవిడ దగ్గరా ఇలాంటి రవికే ఉందన్నమాట" అని అంతా ఆశ్చర్యపోతే... 'సరేలే... పక్కపక్కన నిలబెడితే ఆవిడా నేనూ అక్కాచెల్లెళ్లనుకుంటారని మా వాళ్లంతా అంటూ ఉంటారు' అని ఇంకాస్త తిరగమోత పెడుతుంది. అలా వీధిలో మజిలీలు చేస్తూ గుడికి చేరి, బిచ్చగాళ్ల గుంపు దగ్గర ఉన్నట్టుండి స్పీడు పెంచి క్షణంలో గర్భగుడికి చేరుకుంటుంది.

తిరిగి వచ్చేటప్పుడు ఇంకో వీధి గుండా అందరి దగ్గరా ఆగి నడుస్తూ ఇంటి దోవ పడుతుంది. వసారాలో కూర్చున్న భర్త చేతిలో కొబ్బరిముక్క పెడుతూ, 'అబ్బబ్బ! మన ఊరంతా లేకి మూకే. ఈ పట్టు రవిక చూసి ఏమి ప్రశ్నలు, ఏమి ప్రశ్నలు! ఎక్కడ కొన్నావనీ, అచ్చం అంజలీదేవిలాగా ఉన్నావనీ ఒకటే కాకి గోల. వదిలించుకుని వచ్చేటప్పటికి ఈ వేళయింది. కాస్త కొత్తగా ఏదైనా ధరించి ఇల్లు కదలటం భయం!" అంటూంది లోపలికి వెళుతూ. వెటకారంగా నవ్వుకుంటారు కామందుగారు, వెనక నుంచి.

కామందుగారి బంధువుల అబ్బాయి లండన్ నుండి వచ్చాడు. వస్తూ వట్టి చేతులతో రాకుండా ఒక చాలా పెద్ద సైజు అందమైన గొడుగు కానుకగా తెచ్చిపెట్టాడు. ఎన్నో అందమైన బొమ్మలతో, పలు రకాల రంగులతో చూచేవారికి ముచ్చట గొలుపుతుంది. ఆ గొడుగు అన్ని రంగులలోకి బంగారపు రంగు మరింత కొట్టొచ్చినట్టు కనబడుతోంది. పిడి దగ్గర రంగుల రాళ్లు తాపడం చేసి ఒక రకమైన ఠీవిని గొడుగుకు చేకూరుస్తున్నాయి. చాలా ఖరీదైనదట. పెద్దమ్మ సంతోషానికి అవధులు లేవు. యథాప్రకారం తన సంతోషాన్ని పది మందికీ పంచాలని మనసు తహతహలాడింది. వంట చేస్తూండగా అందుకు తగిన ప్రణాళిక తట్టింది. ఇక క్షణం ఆలస్యం చేయకుండా దానిని అమలులో పెట్టింది.

మినప్పప్పు నానబోసి, గుమ్మడికాయ కోసింది. మంచి రోహిణీకార్తె ఎండలు. వడియాల పిండి సిద్ధం చేసుకుంది. కామందుగారు గొడుగు తెరిచి పట్టుకుంటే ముందు లోగిలి రెండు తాటాకు చాపలు, దానిపై బట్ట పరిచి వడియాలు పెట్టడం మొదలెట్టింది. ఎండ వేడిమి తెలియనివ్వకుండా గొడుగు నీడ హాయిగా ఉంది. వీధిన పోయేవారంతా గుమ్మం దగ్గర ఆగి అబ్బురంగా చూస్తున్నారు. రాజుగారి ఛత్రమంత గొడుగు, ఎండలో ఇంద్రధనుస్సులా మెరిసి కళ్లు జిగేలుమనిపిస్తోంది. పెద్దమ్మకు నలుగురూ నిలబడి చూస్తూంటే వడియాలు పెట్టడం చెప్పలేనంత సంబరంగా, ఒకింత గర్వంగా ఉంది. కామందుగారికి మాత్రం ఆ పరిస్థితి ఇబ్బందికరంగా అనిపించసాగింది.

"భార్య ఎండన పడి వడియాలు పెడుతూంటే మొగుడు చెయ్యందగా గొడుగు పట్టడం లోకవిరుద్ధమా? ఎందుకట్టా గింజుకుంటారు?" అని విసు


క్కుంది పెద్దమ్మ.

"నువ్వు వడియాలు పెట్టడం, నేను గొడుగు పట్టడం రెండూ ఫర్వాలేదు కానీ, ఎక్కడ లేని జనమంతా చోద్యం చూస్తున్నట్లు నోళ్లు వెళ్లబెట్టుకుని గుమ్మంలో నిలబడితే అదో రకంగా ఉన్నదే..." అన్నాడాయన నానుస్తూ.

"చూడనివ్వండీ..." ఓదార్పుగా అన్నదామె "మనల్ని కాదుగా. గొడుగును లెండి". మర్నాడు పదకొండు గంటల వేళ ఎండనపడి గుడికి బయలుదేరింది... (అదేలెండి గొడుగుతో) ఇప్పుడేం గుడి? నైవేద్యానికి తలుపులు మూసేవేళ" అన్నాడు కామందుగారు ఆశ్చర్యంగా. 'గుడికి పోవటమూ తప్పే' అంటూ వీధిలోకి అడుగుపెట్టిందామె. అలా లండన్ గొడుగు ఊరుచుట్టి వచ్చింది. దాని గొప్పతనం గురించి అంతా ఒకటికి నాలుగుసార్లు విని తరించారు. 'ఎలా ఉంది' అని అస్తమానం అడుగుతూంటే ముఖస్తుతి అలవాటు లేని జనం చూసీ చూడనట్టు తప్పించుకు తిరగటం పెద్దమ్మకు బొత్తిగా నచ్చట్లేదు.

ప్రతీ నెలా ఊరి పొలిమేర మైదానంలో సంత జరుగుతుంది. ఆ తడవ ఎండలకు జడిసి జనం ఎక్కువ మంది ఇంటిపట్టునే ఉండిపోయారు. నిజానికి పెద్దమ్మకు సంతలూ, జాతరలూ వంటివి కంటికి ఆనవు. అలగామూక, పేద వాళ్లు మాత్రమే అక్కడ కిక్కిరిసి ఉంటారని ఆమె అభిప్రాయం. గొడుగు వచ్చాక పరిస్థితి వేరు కాబట్టి తప్పనిసరై ఆవిడ చేతి సంచీ పుచ్చుకుని సంతకు వెళ్లింది ఏ మాటకామాటా చెప్పుకోవాలి. ఎండ తీవ్రత ఆమెను బాధించలేదు. నెమ్మదిగా ప్రతీచోటా ఆగుతూ సంత మొత్తం తిరిగి చూస్తూ జీడిపప్పు, ఎండుద్రాక్ష వంటివి కుప్పబోసుకుని కూచున్న అమ్మి దగ్గరకు వచ్చింది. అమ్మి రూపం పెద్దమ్మకు చికాకు కలిగించింది. నిండుచూలాలు, ఇప్పటికో ఇంకాసేపటికో కనేటట్టుంది. వత్తయిన జట్టు తలపైకి పోగుచేసి కట్టిన చింపిరి ముడి, జల్లెడలాగా చిల్లులు పడ్డ ముతక చీర, చంకలో ఏణ్ణార్థం పసిపిల్ల పక్కనే మురికిలో మునిగి తేలుతున్న నాలుగైదేళ్ల పిల్లవాడూ ఏడుస్తున్నారు. "యాదవకండయ్యా మీ అయ్య అన్నమట్టు కొత్తాడు" అని ఎంత నచ్చజెపుతున్నా వారి ఖాళీ కడుపులు నమ్మే స్థితిలో లేవు. ఆ ఏడుపుల మధ్య తనకు కావల్సినవేవో బేరం చేసింది పెద్దమ్మ అమ్మి బేరం వినిపించుకునే స్థితిలో లేదు. ఎండకు తాళలేనట్లు నిస్త్రాణగా ఉందామె పరిస్థితి. నిండు నెలలు, పిల్ల ఏడుపు... "ఏదో ఒకటి తీసుకోవమ్మా" అన్నది పెద్దమ్మతో కొనుగోలు చేసి వెనుదిరిగిన పెద్దమ్మ "అమ్మా నాయనో" అని బాధగా గరిచిన అరుపులకు గిరుక్కున వెనక్కి తిరిగి చూసింది. ఉన్నట్టుండి పురిటి నొప్పులు మొదలై బాధతో విలవిల లాడుతోంది అమ్మి.

"ఏవైందమ్మోవ్? నొప్పులొస్తున్నాయా?" ఆత్రతగా అడిగిన పెద్దమ్మకు జవాబు చెప్పే స్థితిలో లేదామె.




మెలికలు తిరిగిపోతూ బాధకి తల అటూ ఇటూ విసురుతోంది. సంతలో వయసున్న ఆడవాళ్లెవరూ కనబడలేదు. నలుగురు పది, పన్నెండేళ్ల ఆడపిల్లలు తప్పించి, దరిదాపుల్లో గుడిసెల్లాంటి మరుగు ప్రదేశాలే లేవు. అంతా మైదానమే. పురుటినెప్పులు పుంజుకొంటున్నాయని పెద్దమ్మకు అర్థమైంది. సంచీ అవతల పారేసి కొంగు నడుముకి బిగించింది. మగవాళ్లందరినీ ఒక్క అరుపుతో దూరంగా తరిమేసి, అమ్మిని పక్కగా పడుకోబెట్టింది. పిల్లలను తండ్రికి అప్పగించమని ఆడపిల్లలకు పురమాయించింది.

లండన్ గొడుగును దడిగా అడ్డం పెట్టింది. ఆ క్షణంలో స్త్రీ సహజమైన మార్ధవం, మాతృభావన, కారుణ్యం ఉప్పొంగి పేదరాలైన అమ్మి పాలిట అశ్వినీ దేవతలైనాయి.

ఆ మిట్టమధ్యాహ్నపు వేళ ఊరి పొలిమేర సంతలో పెద్దమ్మ చల్లటి చేతుల మీదుగా ప్రాణం పోసుకున్న ఒక చిన్నారికి లోకం స్వాగతం చెప్పింది.

★ ★ ★

పెద్దమ్మ పేరంటానికి వెళ్లింది.

"పెద్దమ్మత్తా, ఈ చీరెక్కడ కొన్నా? భలే చక్కంగా ఉన్నదే" అని ఒక ఇల్లాలంటే "పెద్దమ్మ పిన్నీ, ముదురాకుపచ్చ రంగు నీకు నప్పినట్టు ఎవ్వరికీ నప్పదమ్మో" అని ఒక పడుచుపిల్లా, "పెద్దమ్మ తల్లీ, నీ బంగారపు గొడుగే గొడుగు. ఇల్లాంటిది ఇంకెక్కడా ఉండబోదు" అని ఒక ముసలమ్మా... పెద్దమ్మ కనబడితే చాలు అంతా ముందుకు వచ్చి ఆదరంగా పలకరించేవారే! ఆమె అందాన్నీ, అలంకారాలనూ మనస్ఫూర్తిగా పొగిడేవారే!

లేనివారిని తక్కువగా చూసే అహంభావిగా, పొగడ్తలకు ఆశపడే గర్విష్టిగా ఇప్పుడావిడ ఎవ్వరికీ కనిపించటం లేదు.

గొడుగును దడిగా పెట్టి ఆవిడ చేపట్టి నిర్వర్తించిన మానవతాధర్మం జనం కళ్లకు కమ్ముకున్న పొరలను ఒక్కసారిగా కరిగించి వేసింది. ఆపత్సమయంలో ఆవిడ స్పందించిన తీరు పల్లె మనసును గెలుచుకుంది. అంతదాకా అందరూ ఆమెను గురించి ఏర్పరుచుకున్న అభిప్రాయం ఈ ఉదంతంతో పూర్తిగా పటాపంచలై గ్రహణం విడిచిన చంద్రబింబంలా ఆమె నడిచిన మేర చల్లటి మమతల కాంతి పరుచుకుంటూ పోతోంది.

ఇన్ని మాటలెందుకు? ఎక్కువగా నోరు విప్పని పెదకామందుగారే నోరారా 'మహాలక్ష్మి' అంటూ ఆవిడను అసలైన పేరుతో తరచూ పిలవటం నేను స్వయంగా విన్నాను. ☆